కూలితల్లి

వి. రాజా రామమోహనరావు

ఆ యింట్లో తనజీవితం ఎన్నేళ్ళనుంచీ గడుస్తోందో రంగమ్మ ఎప్పుడూ లెఖ్ఖ పెట్టుకోలేదు.

ఆ యిల్లు తప్ప తనకి బయట వేరే జీవితం వుందన్న విషయం మరచిపోయి చాలా ఏళ్ళయింది అలాంటిది ఆ రోజు సుశీలమ్మ అలా అన్న దగ్గర్నుంచీ కాలూ చెయ్యీ ఆడలేదు. ఇంటిపనిమీదే కాదు, బతుకు మీదే ఆసక్తి అడుగంటి నట్టనిపించింది.

*　*　*

జీవితంలో పూర్తిగా ఏకాకి అయిపోయిన కొత్తరోజులవి. ఏం చెయ్యాలో, ఎలా బతకాలో... అసలు బతకాలో వద్దో ఏమీ నిర్ణయించుకోలేని అయోమయంలో వున్న కాలం అది. పక్క పాక వెంకమ్మ పని ఖాళీగా వుందని తీసుకొస్తే మొదటిసారి ఆ యింట్లో కాలు పెట్టింది.

విశాలంగా పెద్దమైదానంలా వున్న హాలులో ఏదిక్కూ తోచనట్టు నిలబడింది. చాలాసేపు. మేడమీంచి దిగొస్తున్న

1978 చక్రపాణి మూతన అవార్డు పొందిన కథ

సుశీలమ్మని చూసి వెంకమ్మే ముందు... 'దండాలండి...' అన్నాక తలెత్తి చూసింది.

సన్నగా, నాజుగ్గా, తెల్లగా, అందంగా, నిండుగా వున్న పాతికేళ్ళైనా దాటని సుశీలమ్మని చూసి 'ఏంటి యిలా వుంది అనుకుంది.' అనుకున్నాక ధైర్యం వచ్చింది

సుశీలమ్మంటే వెంకమ్మ తనకన్నా పెద్దగా, లావుగా యింకేదోలా వుంటుందనుకుంది ముందు. అలాంటిది తనకన్నా వయసులో చిన్నగా వున్న సుశీలమ్మని చూసి బెరుకు తగ్గిన మనసుతో తనూ దణ్ణమెట్టింది.

"నీ పేరేమిటి." అంది కుర్చీలో కూచుంటూ సుశీలమ్మ.

"రంగి, అండి," అంది.

ఎదురుగా కనిపిస్తున్న మట్టికాళ్ళ దగ్గర్నించి, బొట్టులేని ముఖం వరకూ వో క్షణం చూసింది సుశీలమ్మ. చూసి, "పసిపిల్లాడ్ని పెంచాలి... వొచ్చా" అంది.

'వొచ్చన్నట్టు' తలూపింది రంగి.

~~"పిల్లలున్నారా..." అనడిగింది.~~

"ఇద్దరు పుట్టి పోయారండి..." అంది రంగి.

ఆరోజే పనిలో చేరిపోయింది రంగి. అంత పెద్ద యింట్లో ఎంతమందుంటారో ఏ రకం గొడవలుంటాయో అని ముందు భయపడింది. కానీ సుశీలమ్మ భర్త, మరో యిద్దరు పనివాళ్ళు తప్ప ఎవరు లేకపోవటం, నెలేనా నిండని సుశీలమ్మ కొడుకుని సాకడం తప్ప వేరే పనే లేకపోటంతో తేలికపడింది రంగి మనసు.

నెల గడిచేటప్పటికి ఆ యిల్లు, యింటి మనుషులు, వాతావరణం బాగా అలవాటయ్యాయి. ఇదివరకు మొగుడు బయటకెళ్ళినపుడు వొంటరిగా పాకలో ఎలా వుండేదో అలాగే వున్నట్టుంది. పాత పాకే బాగా పెద్ద యిల్లయి, ఆ యింట్లో తనకి సరిపడ్డ వో మూల బతుకుతున్నట్లే వుంది. కొత్త తగ్గాక చాలావరకు అయోమయం తగ్గింది. జీవితం యిలా గడిచినా చాలనిపించింది.

ఆ నెలలో ఒకటి రెండుసార్లు తన పాకకి వెళ్ళివొచ్చినా రాత్రింబవళ్ళు రంగి మకాం ఆ యింట్లోనే. ఆ పక్క మేడలోనే పనవటంవల్ల వెంకమ్మ చూసి పోతుండేది. వొచ్చినప్పుడల్లా... "ఎలావున్నావే..." అనేది వెకమ్మే ముందు.

'బాగానే వున్నానన్నట్టు' తలూపేది ~~రంగి. ఆతరువాత యిద్దరికీ తీరుబడితే~~ కాస్సేపు కష్టంసుఖం చెప్పుకునేవారు. వెంకమ్మే ఎక్కువ వాళ్ళ కబుర్లు వీళ్ళ కబుర్లు చెపుతుండేది. అలా కబుర్లతోనే ఆ రోజు చాలా మామూలుగా అంది వెంకమ్మ... ముందంటే నీకు "పని కొత్త...ఎంటనే పనవసరం... అందు

కని మిగిల్నాయి పెద్దగా సూసుకోకుండా పనితో చేరావు...నేనూ వూరుకున్నా... యిక్కడే పడుండి అస్తమానం పిల్లాణ్ణి చూసే నీలాంటి మనిషి యీళ్ళకి అవసరం. లేకపోతే ఆళ్ళ పనులు, సరదాలు సాగవు. అందుకని సుశీలమ్మని జీతం పెంచమని అడుగు..." అంది.

రంగి ఏం మాట్లాడకపోవటం చూసి "ఏం సుశీలమ్మని నన్నే అడగమంటావా..." అంది వెంకమ్మే తిరిగి.

"వొద్దు... వొద్దు ..." అంది కంగారుగా రంగి.

"నెమ్మదిగా నువ్వే అడుగు. మన సంగతి మనం గుర్తు చేస్తేనే కానీ పెద్దోళ్ళకు గుర్తుండదు. తెలిసిందా," అంది వెంకమ్మ.

వెంకమ్మ అలా అన్న ఆ మాటలు రంగిని అంత తేలిగ్గా వదలలేదు. ఇంటివాళ్ళిస్తున్న జీతం డబ్బు... మొగుడుతో గడిపిన జీవితం... చచ్చిపోయిన పిల్లలు. యిలా గతంలోంచి చాలా గుర్తొచ్చాయి. ఇంచుమించు వారంరోజులు ఆ కలత వదల్లేదు రంగిని. కొన్ని వాటంతట అవే గుర్తొచ్చాయి. మరికొన్ని కావాలనే గుర్తుతెచ్చుకుంది.

ఈ యింట్లోవుండి పాకలో గడిచిన జీవితం గుర్తు తెచ్చుకుంటే డబ్బు యిబ్బంది, తననీ మొగుణ్ణీ ఎన్ని రకాలుగా బాధపెట్టింది. యిద్దర్నీ ఎంత యిరకున పెట్టిందీ మరింత బాగా తెలిసింది, రంగికి.

రంగి మొగుడు మొదట్నుంచీ తాగేవాడు. అందరిలాగే తన మొగుడు అనుకుంది. తప్పుగా అనుకోలేదు. కానీ మొగుడు ఏఅర్ధరాత్రో వచ్చి, అవసరాలు తీరేవరకే తెలివిగా వుండి, తర్వాత ఏ వులుకూ పలుకూ లేకుండా మొద్దులా నిద్దరపోతుంటే కొంత బాధగా వుండేది. అయినా... 'అలిసిన ప్రాణంలే' అని సరిపెట్టుకునేది.

రోజులు ఆ రకంగానూ గడవలేదు. రంగి కాన్పులు కష్టమవటం. పుట్టిన పిల్లలకు రోగాలు రావటం...చివరికివాళ్ళు దక్కకపోటంతో యింటి పరిస్థితే మారిపోయింది. వీటన్నిటిలో అప్పులయ్యాయి. అలా అయిన అప్పులూ అంత పెద్దవేం కావు. మొగుడు పెళ్ళాన్ని, యింటిని... యింటిలో సుఖాన్ని నాశనంచేసేంత పెద్దవేంకావు. కానీ చివరికి అంతా నాశనమే అయింది.

అప్పుల్తోపాటు రంగి మొగుడి త్రాగుడూ పెరిగింది. అవితీర్చెయ్యాలని రాత్రింబగళ్ళు రిక్షా లాగి లాగి.... ఆ చిరాక్కి మరింత తాగి... ఆ తాగుళ్ళో రంగిని తన్ని, తిట్టి నానా గొడవచేసేవాడు. మొగుడు యింటి కొస్తున్నాడంటే భయం... తిట్లు, తన్నులు కన్నా, మొగుడు తనమీద చూపించే అసహ్యమే మరీ యిబ్బందిగా

వుండేది రంగికి... చివరికి తన కసి, ఎవరిమీద చూపించాలో దేనిమీద చూపించాలో తెలియక పెళ్ళాన్ని మొరటుగా బాధపెట్టటం అలవాటైంది రంగి మొగుడికి.

ఆ పాకలో నే చోట కలిసి వున్నారు, కలిసి పడుకుంటున్నారని తప్ప యిద్దరి మనసుల మధ్యా యింకేం మిగల్లేదు. ఎప్పుడో .. ఎలాగో వరికి మగ తోడంటేనే పూర్తిగా యిష్టం పోయింది రంగికి.

'ఆ రోజుల్లోనే కనక డబ్బుంటే. ఆ అప్పులు తీర్చేసే అవకాశం వుంటే .. బతికుండగానే మొగుడు అంతదూరమై వుండకపోను' ... అనిపించింది రంగికి.

'యింటివాళ్ళు ఏదో జీతం యిస్తున్నారు. దాని అవసరమే లేదు. రోజూ తిండి గడుస్తోంది. వుండటానికి నీడుంది .. యిప్పుడు జీతం పెంచమనటం ఎందుకు.. అనుకుంది రంగి. మళ్ళీ ఒపక్క డబ్బుమీద మనసు పీకుతూనే వుంది రంగికి.' అవకాశం వున్నపుడు అడిగితే మాత్రం ఏం... అని, 'తీరా అడిగాక వాళ్ళకి అది నచ్చక గుట్టునప్పుడు కాకుండా పనిలోంచి తీసేస్తే ..' ఆ ఆలోచనతో గుండె దడదడ లాడింది. తిరిగి పాత పాకలో తన బతుకు.. నువ్వింకా పనికొస్తావు నాతో చేరు.. నా దగ్గరుండు అనే మగాళ్ళు...అవేవీ భరించలేదు. మరో యిల్లు. మరో యిల్లు పనికోసం వెతుక్కుంటూ తిరగనూలేదు అందుకనే చివరికి వారం తరువాత నో నిర్ణయానికి వచ్చేసింది రంగి.

మరో పదిరోజులకి సుశీలమ్మకి చెప్పి వెళ్ళి పాక ఖాళీ చేసేసి తన సామాను తెచ్చేసుకుంది

ఆ తర్వాత రెండేళ్ళకి వెంకమ్మ చచ్చిపోయాక యింక బైట సంగతులు తెలవడం మానేసాయి. ఆశక్తి అంతగా మిగల్లేదు రంగిలో. ఆ యిల్లు ఆ యింటి వాళ్ళతోనే జీవితం ఇంటివాళ్ళల్లో అయినా ఆ చిన్నకుర్రాడితో, వాడి నవ్వుల్తో, ముద్దు ముద్దు మాటల్తో... కంటి మీదకి కునుకేనా రానియ్యని ఆ పసివాడు రోగాల్తో గడిచిన అనేక వందల రాత్రులతో రంగమ్మ జీవితం ముడిపడిపోయింది. ఆ కుర్రాడి తాలూకు చాలా చిన్న చిన్న విషయాలే రంగికి చాలా పెద్ద సంతోషాలయ్యాయి. ఆ కుర్రాడికి పేరు పెట్టేరోజు సుశీలమ్మ... "బాబుకి మురళి అని పేరు పెడుతున్నాం..." అని ముందు చెప్పినందుకే పొంగిపోయింది రంగి. ఆ కుర్రాణ్ణి స్కూల్లో చేర్చే రోజు కూడా కారులో తనని తీసికెళ్ళినందుకు తనబతుకు ధన్యమైపోయినట్టు సంతోష పడింది.

'దాయమ్మా' అని ఆ కుర్రాడు పిలిచే పిలుపు... 'మురళి బాబు...

మురళీ బాబు...' అని తను పిలిచే పిలుపు యివి రెండే చాలావరకు జీవితం అయిపోయాయి రంగికి.

ఏళ్ళు గడుస్తుంటే, అనుభవాలు పెరుగుతుంటే... యింటివాళ్ళ కోప తాపాలు, యిష్టా యిష్టాలు బాగా అలవాటవుతుంటే... ముసలితనం వొంటిమీద కొచ్చి రంగి చాలామందికి రంగమ్మ అయింది.

చిన్నతనంలో రంగి వాళ్ళ పల్లె టూళ్లో చాలా తోటలుండేవి. యింటి ముందు ఎన్నో చెట్లుండేవి. రోజూ ఎన్నో గంటలు వాటిచుట్టూ తిరుగుతూ, వాటి వెనక దాక్కుంటూ చాలా ఆటలు ఆడుతుండేది. పెళ్ళయి వాటినుంచి దూరమయ్యాక, అలాంటివే తనుండే చోట పెంచుకోవాలనుకుంది. పాక పక్కన పాక, మురికాల్వలు పల్లెలో లాగ పట్టణాలలో అది కుదరదని తెలియ టానికి ఎంతో కాలం పట్టలేదు రంగికి. తను తల్లి అయ్యాక తిరిగి పాత పెంపకం కోరిక తలెత్తింది. జీవితంలో అదీ తీరలేదు. చివరికి ఆ ఆశ యీ యింట్లో యిలా తీరినట్టయింది రంగికి.

మడికట్టి నీళ్ళు పోసి శ్రమపడి పెంచిన మొక్క ఎదుగుతుంటే ఎలా వుంటుందో అలా వుండేది ఎదుగుతున్న మురళిని చూస్తుంటే. ఆ చెట్టు కాపు మీద తనకి ఏ రకం ఆశాలేదు. అది తెలిసీ తృప్తిగానే వుండేది. రంగికి.

ఒకళ్ళుండి పెంచాల్సిన వయసు మురళికి దాటేశాక తన బతుకేమవు తుందోనని చాలామార్లు బెంగపడేది. కానీ ఆ యిల్లు తనకి దూరమవదని, ఆ యింట్లో తనూ వో భాగమే నని మొండి ధైర్యంగానూ వుండేది.

మురళి పెద్దవాడైనా, సుశీలమ్మకి తిరిగి పిల్లలు పుట్టకపోయినా రంగమ్మని ఆ యిల్లు వొదలమని ఎవరూ అనలేదు. ఇంటిపని, వంటపని చూసుకుంటున్న రంగమ్మకి రోజులు గడుస్తూనే వున్నాయి.

పెరిగిన వయసు, బలంతగ్గి వొళ్ళు యిదివరకంత చురుగ్గా రంగమ్మ పని చెయ్యలేకపోతుంటే యీ మధ్యనే మరో పనిపిల్లని పై పనికి కుదిర్చిందిరంగమ్మ.

ఇంటిపని చాలావరకు ఆ కొత్త పిల్ల మణే చేస్తోంది. తను పెంచిన మురళిని చూసుకోవటం, చిన్న చిన్న పనులు చేయటం పెద్దగా పనేం మిగల్లేదు రంగమ్మకి.

పెద్దయిన మురళి... 'దాయమ్మా.' ...అనకుండా 'రంగమ్మా' అని పిలుస్తున్నపుడే కొంచెం యిబ్బందిగా వుండేది. 'అయినా పిలుపుకేమిలే...' అని సమాధాన పడి రోజులు గడుపుతోంది.

* * *

కేకలు, గోల ముందు తిన్నగా వినలేదు రగమ్మ. ఇంట్లో సుశీలమ్మ, భర్త లేరు...మురళి నిద్రపోతున్నాడు.

గోల కొంచం వినిపించినా బయట వీధిలోనేమో అనుకుంది.

కానీ మణిగొంతు వినిపించేటప్పటికి వంటింట్లోంచి బైటికొచ్చింది. ఏదిగది లోంచి... మురళి పడుకున్న గదిలోంచే గోల...లోపల ఏం జరుగుతోందో గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు. వేసున్నతలుపుల్ని దబదబా బాదింది. "మురళి బాబూ... మురళి బాబూ..." అని అరిచింది.

క్షణం ఆగిన గోల తిరిగి ఆరంభ మైంది. రంగమ్మ అరుపులకి మురళి ఏం బదులు పలకలేదు. తను పెంచిన మురళి పనిపిల్లని గదిలో నిర్బంధిస్తుంటే, ఆ గోల చెవుల్ని గింగిర్లెత్తిస్తుంటే... ఎన్నో ఏళ్ళనుంచి తనను అసహ్యించు కొని దూరమైన మొరటుతనం మురళి రూపంలో కనిపిస్తుంటే కంగారుపడింది రంగమ్మ... ఆరాటపడింది. దిక్కు తోచకుండా పరిగెట్టింది. వీధి గుమ్మం చేరి తనకు తెలిసీకొంతా తెలియక కొంత అరిచింది.... "అన్యాయమైపోతోంది... రండినాయనో..." అని, గొంతు చించుకుంది.

రంగమ్మ అరుపులకి యింటినౌకరుతో బాటు మరో యిద్దరు బైటివాళ్ళు కూడా వొచ్చారు తలుపు విరగ్గొట్టేంత పనిచేస్తుంటే తలుపు తెరుచుకుంది.

రెక్కతెగిన పక్షిలా, చెదిరిన బట్టల్తో రివ్వునొచ్చి తనని అంటుకు పోయిన మణినే చూసింది రంగమ్మ.

కొంచెం తేరుకున్నాక వచ్చినవాళ్ళని పంపించేశారు, నౌకరూ, రంగమ్మ. పెరట్లోకితీసికెళ్ళి మణిని వోదారుస్తూ తనని తను వోదార్చుకుంది రంగమ్మ.

జరిగిన గొడవంతా సాయంత్రానికే సుశీలమ్మచెవినిపడింది. అయినామర్నాటి దాకా ఆ గొడవెత్తలేదు ఆరోజంతా కాలుగాలినపిల్లిలా తిరిగింది రంగమ్మ. గదిలోనేవున్న మురళి దగ్గరకెళ్ళి ఒకటి రెండుసార్లుకావాలనేపలకరించింది మురళి పలకకపోతే మరింత కుంగిపోయింది.

సుశీలమ్మఎదురుపడితే... ఆవిషయం ఎత్తితే బావురుమని ఏడ్చి తన గుండె బరువంతా దింపుకోవాలనిపించింది రాత్రి పడుకున్నా తిన్నగా నిద్రరాలేదు రంగమ్మకి. కలతగా పట్టిన నిద్రలో పాత పాక...ఆ పాకలో మొరటిబతుకు ...ఆ పాకచుట్టూ దెయ్యాల్లా వెకిలి చూపులు చూస్తూ తిరిగే దరిద్రమూక కనిపించాయి... చచ్చిపోయిన పిల్లలు కనిపించారు... తను పెంచుకోవాలనని కలలుగన్నచెట్టు చీడ పట్టి కనిపించింది.

తెల్లారిన చాలాసేపటికి, పొద్దున్న యింటిపని అయిపోయే సమయానికి... 'మణిని సుశీలమ్మగారు రమ్మంటున్నా రని' కబురు తెచ్చాడు నౌకరు.

బెరుకుగా బెరుగ్గా వెళ్ళిన మణి పావుగంటలోపే దిగాలు ముఖంతో తిరిగొచ్చింది. 'అమ్మగారు నన్ను పని లోంచి ఎల్లిపొమ్మన్నారు...' అంది. అలా అంటుంటే దానికి ఏడుపొచ్చింది.

మణిని దాని ఏడుపుని చూస్తుంటే రంగమ్మకి కాస్సేపు ఆలోచన సాగలేదు. ఈ మధ్యనే తండ్రి పోయిన పిల్ల, తల్లి లేని పిల్ల... పదహారేళ్ళ ఆ వయస్సులో దానికి అన్నీ కంగారే ... అంతా భయమే...

"ఊరుకో... దీని కేడుపెందుకు .. సుశీలమ్మతో నే మాట్టాడతాగా..." అంది చివరకు రంగమ్మ.

మణి కొంచం తేరుకున్నాక సుశీలమ్మ దగ్గరకెళ్ళి నిలబడింది రంగమ్మ. కాస్సేపు నిలబడ్డాక...

"మణిని పనిలోంచి వెళ్ళిపొమ్మనారని...తెగ ఏడుస్తోంది..." అంది.

"పొమ్మనక నెత్తినెక్కించుకోమంటావా... అసలు వున్న దరిద్రానికే పడలేక చస్తుంటే మళ్ళీ యిదికూడానా" అంది సుశీలమ్మ.

సుశీలమ్మ కోపం రంగమ్మ అనుభవంలో వున్నదే అందుకే "పోనీలెండి అయిందేదో అయిపోయింది... దీన్నెందుకు పొమ్మనటం..." అంటూ ఏదో చెప్పబోయింది.

అయిందేదో అయిపోయిందా...అంతే నీకు అలాగే తేలిగ్గావుంటుంది ఎంత అల్లరి, ఎంత గొడవ... అయినా ఏమంతకొంప మునిగిందని... వయసులో ఏ కుర్రాడికి మాత్రం తొందరపాటుండదు... అయినా చేసిన అల్లరంతా చేసి అయిపోయిందంటున్నా...వా" అంది సుశీలమ్మ.

"అదికాదు బాబుని నేనెంతగానో ఆపాలని చూశా...కానీ" రంగమ్మని మాట పూర్తి చెయ్యనివ్వలేదు సుశీలమ్మ.

"నువ్వేం చెప్పఖ్ఖర్లే... నాకంతా తెలుసు... అయినా నువ్వు వాణ్ణి కన్న తల్లివైతే యింత అల్లరి చేస్తావా... నలుగురి కళ్ళల్లో పడేలా చేసేదానివా. కన్న పేగుకి తెలుస్తుంది పిల్లల్ని ఎలా కడుపులో పెట్టుకోవాలో... అదీకాక యింత జరిగాక ఆ మణిని వెనకేసుకొస్తున్నావా... ఎంతైనా మీ జాతి బుద్ధి పోనిచ్చావుకాదు. పిల్లాడిమీద లేకపోయినా... యిన్నాళ్ళు యీ యింటి తిండితిన్నానన్న విశ్వాసం లేకపోయింది నీకు... ఛీ... ఛీ..." అంటూ అక్కడ్నించి లేచి వెళ్ళిపోయింది సుశీలమ్మ.

రంగమ్మ చాలాసేపు ఎదురు చూసింది కోపం తగ్గి సుశీలమ్మ వస్తుందేమోనని. ఎప్పటికీ రాకపోతే తిరిగి వెనక్కి వచ్చేసింది. వచ్చేసినా ఆ రోజంతా ఆశపడింది రంగమ్మ.

మర్నాడు మామూలుగా పనిలోకొచ్చిన మణిని గుమ్మంలోనే నిలవేసింది సుశీలమ్మ.

ఏంచెయ్యాలో తోచక దిక్కులు చూస్తూ గుమ్మంలోనే ఆగిపోయిన మణిని చూస్తూ సుశీలమ్మకి నచ్చచెప్ప

బోయింది రంగమ్మ. వింటే సుశీలమ్మకి దిక్కులేని మణి పరిస్థితంతా వివరంగా చెప్పాలనుకుంది.

ఆ అవకాశం యివ్వలేదు సరికదా... యింత జరిగాక నిన్నుండనిస్తున్నందుకే సంతోషించు మురళి నీ ముఖం కూడా చూడనంటున్నాడు... వచ్చే వయసొచ్చింది. ఏమూలో కాలంగడుపు. అంతే తప్ప అన్నీ నీకే కావాలని పూసుకు తిరక్కు... తెలిసిందా..." అంది సుశీలమ్మ.

అంతవరకు అట్టడుగున కదుల్తున్న ఆశ కాస్తా అడుగంటింది రంగమ్మకి. దిగులుగా వెనక్కి తిరిగిన మణి కూడా గుమ్మందాకా వెళ్ళి సాగనంపింది.

మణిని పంపేసి తిరిగి ఆ యింట్లోకి వస్తుంటే ఏదో పరాయి యింట్లోకి, తనదేంలేని ప్రపంచంలోకి తప్పనిసరిగా వెడుతున్నట్టనిపించింది రంగమ్మకి. ఎవరితోనూ చెప్పుకోలేని దిగులుకి ఆ ముసలిమనసు పగిలి బీటపడినట్టయింది.

తన జీవితం అందుకే నన్నట్టు పెంచిన మురళి, సుశీలమ్మ యింక ఎప్పటికీ తనకందనంత దూరమైనట్టనిపించింది. వంటింట్లో కెళ్ళి గుమ్మం పక్కన కూచుంటే, తనున్న ప్రపంచం వాళ్ళున్న ప్రపంచం వేరు వేరుగా తోచాయి రంగమ్మకి. కూలికి బిడ్డని పెంచిన నేను ఎక్కువ ఆశలకి పోయానేమో..." అనుకుంది కన్నీళ్ళు తుడుచుకుంటూ చివరికి.

●